# రాగద్వేషాలు

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంబ.

ఆకాశంలో పున్నమిచంద్రుడు తారలతో కల్సి నడిమధ్యన విహరిస్తున్నాడు. అది అర్ధరాత్రి సమయమైనా పాలవెన్నెలలు కురుస్తోంటే ప్రపంచం అంతా ఓ కొత్త కళతో వెలిగిపోతోంది. దూరదూరంగా తెల్లని వెన్నెలకు స్పృహ తప్పినట్లుండే మంచుకొండలు, వాటిపై విహారం బయల్దేరిన సెలయేళ్ళు అల్లరిగా మెలికలు తిరిగి గమ్యం తెలీకుండా పరుగెత్తుతున్నాయ్. చల్లగా పయనిస్తోన్న తెల్లమబ్బులనీ, జాబిల్లిలోని కళలను తమలో లీనం చేసుకోవాలని దగ్గరకుచేరే తారల్నీ తనివితీరా చూస్తున్నాడు సత్యమూర్తి. తనలో కూడా ఆ ఆనందాన్ని ప్రతిఫలింప జేసుకోవాలని ఏవేవో భావాలు తనలో దొర్లిపోతున్నాయ్.

సత్యమూర్తి బి. ఎ. డిగ్రి తీసుకొని కాలేజీ చెరనుండి బయటపడి తాలూకాఫీసులో గుమస్తాగా ప్రవేశించాడు. నెలకో వంద సంపాదిస్తూ జీవితంలో అడుగు పెట్టిన సత్యమూర్తికి మనస్సులో ఎన్నో కొత్త అనుభూతులు కల్గుతున్నాయ్. చంద్రుడు మబ్బుచాటునుంచి గోముగా తొంగి చూచినట్లుగా, ఉవ్వెత్తున లేచిన కెరటం సంధ్యా సమయంలో నవ్వించి. కవ్వించినట్లుగా, లోకంలోని ఆకర్షణ అంతా ఇప్పుడే తన కళ్ళముందే వెల్లివిరుస్తోన్నట్లుగా వుంది సత్యమూర్తికి. ఏదో ఆనందోద్రేకం కల్గుతోంది. ఆ మత్తుతో ఆకాశంలోని రేరాజును చూస్తున్నాడు సత్యమూర్తి. ఆ వెన్నెలను భరించలేక ఆతని హృదయం రెపరెప లాడ్తోంది. ఆతనిలో ఆలోచనలు రేగాయ్. తను ఒంటరివాడు. తనకి జీవితంలో సుఖం లేదు; దుఃఖం లేదు; ఏకాకిగా తనెంతకాలం ఇంకా ఇల్లా వుండాలి? తనకిప్పుడు తోడుగా జోడుగా ఒక అందాలబరిణ వుంటే? మెదడులో ఆలోచనలు మెదిలినై. నిజంగా తను ఎంత సంపాదిస్తూన్నా కాని వంటరిజీవితం వ్యర్థం! ఒంటరిగా తెగిన గాలిపటంలా తన బ్రతుకులో సాధించేదేమీ లేదు. తరుణానికివచ్చే పైరును కోతకోసి కుప్పలు వేసినట్లే! జీవితంలో స్వర్గసుఖాలను వెదయవలసిన కాలం వృధా కాకూడదు. గులాబీ చెట్టు కొమ్మన పూసిన పువ్వు కొమ్మనే ఎండిపోతే ఫలితం ఏముంది? తనలో యవ్వనం తాలూకు కోర్కెలు ఘనీభవించి పోతున్నాయ్.

తన హృదయం మరొక హృదయాన్ని ఆక్రమించుకోవాలి!

తన మనస్సు మరొకరి మనస్సుతో జట్టాపట్టాలు వేసుకోవాలి!!

తనతో అన్నివిధాలా ఏకీభవించగల స్త్రీమూర్తి తనకు కావాలి!!!

లోకం అంతా ప్రశాంతంగా వుంది.

ప్రపంచం అంతా నిద్ర పోతోంది.

తనకి మాత్రం నిద్ర రావడంలేదు. ఆరాటంతో ఆవేశపడ్తున్నాడు సత్యమూర్తి. తను నెలకి వందసంపాదిస్తున్నాడు. తన జీతంతో హాయిగా భార్యనుపోషించి సుఖపెట్టగలడు తను పెళ్ళిచేసుకోవాలి. చిన్న ఎడారిలాంటి ఈ బ్రతుకులో సౌఖ్యం చూడని బ్రహ్మచారిజీవితానికి స్వస్తి చెప్పాలి. తనింతవరకూ ఏ కన్యనూ ప్రేమించలేదు. తన శ్రేయస్సు కోరే పెద్దలతో తన వివాహ సమస్యను గురించి చెప్పి వెంటనే తగిన ఏర్పాటు చేయించుకోవాలనుకున్నాడు సత్యమూర్తి. ఇలాగే తన పెళ్ళిని గురించి తియ్యగా ఆలోచించుకొంటూండగానే చంద్రుడు పడమటింటికి చేరుకోవడం; బాలభానుడు తూర్పు కనుమల్లో ఎర్రని కాంతుల్తో ఉదయించడం కూడా జరిగింది.

* * *

పాతికేళ్ళ సత్యమూర్తికీ, ఇరవై వసంతాల సావిత్రికీ అతి వైభవంగా వివాహమైంది. చక్కని ఇల్లు అద్దెకు తీసుకుని అర్ధాంగితో గృహప్రవేశమయ్యాడు సత్యమూర్తి. నూతన దాంపత్య జీవితంలో కాలగమనాన్ని కూడా మర్చిపోతున్నారు ఆ ఆనందజీవులు. తనకి భార్య, బంధువులు, హితులూ - బలగం వుందనీ ఆనందంతో పొంగి పోతున్నాడు సత్యమూర్తి. తను సావిత్రివంటి అద్భుత సౌందర్యరాశిని భార్యగా పొందగల్గిన అదృష్టవంతుడనని మురిసిపోతున్నాడు.

సావిత్రి నవ్వుతూంటే; గులాబీ పువ్వులు విచ్చుకున్నట్లు; మయూరం పచ్చగడ్డిమీద పింఛం విప్పు

కొన్నట్లు, నిశ్చలమైన నీటిలో హంస జరజరా నడిచి పోతూన్నట్టు - వేయి పున్నమి వెన్నెలలు తన అర్ధాంగి ముఖంలోనే కాంతి జల్లుతూన్నట్లు ఆనందపరవశుడయ్యే వాడు సత్యమూర్తి. లోకంలోని ఆనందమంతా తమ దాంపత్య జీవితంలోనే వున్నట్లుగా పొంగిపోతున్నారు ఆ జంట.

ఆతడు మాట్లాడుతూంటే - వెన్నెల వెలుగుకు మంచు కొండమీద నుంచి మంచు జారుతూన్నట్లుగా భావించి ఆనందించేది సావిత్రి;

ఆమె నడుస్తూంటే - వేసవికాలంలో వర్షించని మేఘాల నీడలు పల్చని ఇసుకమీద ఒయ్యారంగా కదుల్తూన్నట్లుగా భావించి పరవశించేవాడు సత్యమూర్తి.

లోకంలోని ఆకర్షణంతా వారిరువురి కళ్ళల్లోనూ తిల్లిదిరుస్తూన్నట్లుగా ఒకరి కళ్ళల్లో ఒకరు తమ ప్రతిబింబాలను చూచుకొనేవారు.

'సావిత్రీ! మునిమాపున పొడిచిన నెలవంక వలయాన్ని స్ఫురణకు తెచ్చే నీ కనుబొమల వలయ సౌందర్యం, విచ్చుకున్న తామరపువ్వుపై సూర్యకిరణం పడ్డట్టు మెరిసిపోయే నీ శరీరకాంతీ...నీవంటి భార్యను పొందడం నేను చాలా అదృష్టవంతుణ్ణి సుమా!' అనేవాడు సత్యమూర్తి.

'నీటి అలల్లాగ ఒంకులు తిరిగిన ఆ నల్లని మెత్తని ఉంగరాల క్రాపు, ముచ్చటగా కొట్టొచ్చినట్లున్న ఆ ముక్కు, విశాలమైన ఫాలం...అపర మన్మధునివంటి మీ అందం కంటే నేనెక్కువ సౌందర్యవంతురాలినా?' అంటూ సిగ్గుతో అనేది సావిత్రి.

'సావిత్రీ! నువ్వేగా నా ఆరాధ్య దేవతవు! నీతోనే నాకు లోకం, స్వర్గం, నీ ప్రేమలోనే నా జీవితాన్ని ధన్యత చేసుకోగలను' అంటూ ఆమెను హృదయానికి హత్తుకొనేవాడు. సత్యమూర్తి.

ఆమె చక్కగా మాట్లాడేది; అతడు ఉత్సాహంగా వినేవాడు.

ఆమె ఆనందంగా పాటలు పాడేది; ఆతడు హుషారుగా శృతి కలిపేవాడు.

వారిరువురూ ఆనంద లోకాల్లో తేలిపోతూ మూడు వసంతాలు మూడు క్షణాల్లాగ దొర్లించేసారు సావిత్రీ సత్యమూర్తులు.

* * *

'ఏమండీ...'

'.........'

'అదేమిటండీ?...మాటకూడా చెప్పడానికి అరిగి పోతారా?'

'ఏం'?

'మా అన్నయ్య ఈ దసరాకైనా తప్పకరమ్మని రాశాడుకదా! ఒక్క కార్డు జవాబు కూడా వ్రాయడానికి తీరిక లేదా?

.కావాలంటే నువ్వు వ్రాసుకో'

'నేను వ్రాస్తే బాగుండదు. పండుగ నాటికి వస్తున్నామని మీరే వ్రాయండి'

'వెళ్ళక్కర్లేదు. పండుగకోసం బోలెడంతసొమ్ము తగలేసి అక్కడుకు వెళ్ళేదేమిటి? మూడేళ్ళ నుంచి పోతూనే వున్నాంగా-ఆ డబ్బుతో హాయిగా ఇక్కడే దశరా పండగ చేసుకోవచ్చు'

'ఈ పండక్కి కొత్త పెళ్ళికొడుకు మా చెల్లి భర్తని కూడా తీసుకు వస్తారు. అందుచేత ఎల్లాగైనా వెళ్దామండీ!'

'నాకు శలవులేదు-వంటరిగా ఉండలేను-వండుకో లేను-హోటల్లో తినలేను-నిన్ను పంపించడానికూడా ఇప్పుడు నా చేతిలో డబ్బులేదు'

ఇదే విధంగా పుట్టింటికి వెళ్లాలన్న ఉత్సాహంతో సావిత్రి, తమకి వారివల్లముట్టేది తక్కువ అనే భావంతో సత్యమూర్తి వాదోపవాదాలతో రెండు ఘంటలు ఘర్షణ పడ్డారు. సత్యమూర్తికి సహనం తగ్గి నరసింహావతారం దాల్చాడు. సావిత్రి కూడా రెచ్చిపోయింది. చిలికి చిలికి గాలివానయై సావిత్రి చెంప ఛెళ్ళుమంది. భోజనం చెయ్యకుండా సత్యమూర్తి సైకిలుమీద ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

* * *

సాయంత్రం సైకిలుమీద ఆఫీసునుంచి ఇంటికివస్తూన్న సత్యమూర్తి బుర్రలో అనేక ఆలోచనలు దొర్లిపోతున్నాయ్. 'తను నాల్గువందల రూపాయలు అప్పుచేసి సైకిలుకొన్నట్టు సావిత్రికి తెల్సివుండీకూడా...ఆ అప్పు తీరకుండా అనవసర ఖర్చులు చెయ్యకూడదని నెమ్మదిగా ఇదివరకే తను చెప్పాడు - తమ సంసార పరిస్థితిని తెల్సివుండీకూడా సావిత్రి ఇంత మూర్ఖంగా పట్టు పట్టడంలో

అర్థమేమిటి?...అయినా తను మాత్రం సావిత్రినిఎందుకు కొట్టాలి? పోనీ పంపుతాను తీసుకువెళ్ళమని ఆమె అన్నగారికి తనే కార్డువ్రాస్తే ఇంత తగాదా వచ్చేది కాదే? కలతలు, కలహాలు లేని తమ జీవితాల్లో నేటికి తను సావిత్రిని కొట్టడం; ఆమె కన్నీటిని చూడ్డం...సావిత్రిని తనెందుకు కొట్టాలి? ఆమెకి మాత్రం పుట్టింటికి వెళ్ళి అందరితోనూ సరదాగా గడపాలని వుండదా? చెయ్యి చేసుకోవడం తనదే పొరబాటు, ఆమెను పుట్టింటికి పంపించి తనే జాగ్రత్తగా పొదుపు చేసుకొంటూ కాలక్షేపం చెయ్యడమే ఉత్తమం' అనుకొన్నాడు సత్యమూర్తి. రోడ్డు సాగిపోతూన్నదతని సైకిలు చక్రాలక్రింద.

ఇంటికి రాగానే 'సావిత్రీ!' అని గట్టిగా పిల్చాడు సత్యమూర్తి.

సావిత్రివచ్చి తలుపుతీసి నవ్వుతూ ఆహ్వానించింది.

ఎంతో అలకవహించి వుంటుందనుకొన్నా సావిత్రి కలకలా నవ్వుతూ తలుపు తీసేసరికి సంభ్రమాశ్చర్యాలు పొందాడు సత్యమూర్తి:

'సావిత్రీ! నిన్ను రేపు తీసుకువెళ్ళి మీ పుట్టింట దిగబెట్టివస్తాను. శెలవు దొరికితే పండుక్కి నేనూ వస్తాను... లేకపోతే...'

'ఊహూ! ఒద్దులెండి!! నేను వెళ్ళను!!!' అంది ఆమె.

'ఫరవాలేదులే. ఏలాగో నేనే సర్దుకొంటాను. వెళ్ళిరా.'

'ఇప్పుడు నాల్గోమాసం...అందుచేత వెళ్ళకూడదని మన యింటామె చెప్పారు-' అంది తొణక్కుండా సావిత్రి.

తను తండ్రి కాబోతూన్నందుకు ఆనందంగా ఆమె ముఖంలోకి చూచాడు.

విజయగర్వ సూచకమైన చిరునవ్వొకటి సావిత్రి అరుణాధర సీమపై నాట్యమాడింది.

* * *

పది సంవత్సరాల అనంతరం-

పాపంలా పెరిగిపోయిన ఫైల్సుతో సత్యమూర్తి నలుసులా కన్పిస్తున్నాడు. అతని జీవితంలాగ కాంతి తప్పి వెలుగుతోంది హరికెన్ లాంతరు. బ్రతుకులో గగుర్పాటులకు, భయాలకు అతనిగుండె దడుసుకుని ఎలా ముకుళించుకుపోయిందో, అల్లాగే ఆ దీపకళికకూడా పొగచూరి మసిబారిపోయివుంది. రేగిన క్రాపు నిద్రలేమిచే లోతుకుపోయి అతని వ్యధితహృదయపు గాయాల్ని విడమర్చిచెప్పే కళ్ళు, పదమూడు సంవత్సరాలుగా బ్రతుకు రాటనలో నలిగి కృశించిన ఒళ్ళు, అల్లాగే ఆ మసగ కాంతిలో కాగితాల్లో కలయబడ్తున్నాడు. కొంచెం బద్ధకంతో ఒళ్ళు విరుచుకొని ఆవులిస్తూ నూర్యంలోకి చూస్తూంటే; తన బ్రతుకు దశముందు నుంచీ కళ్ళకి కట్టినట్లు కన్పిస్తోంది.

సావిత్రి మాతృస్థానం అలంకరించుకొన్నది మొదలు ఈ పదేళ్ళల్లో ఆరుగురు బిడ్డలతల్లి ఆయింది. తన పంపాదన మాత్రం గొర్రెతోక బెత్తెడే అన్నట్టు ఎదుగూ బొదుగూలేని జీతం - కలిగినవారికి ఒక్క బిడ్డనైనా ప్రసాదించక పోగా తనబోటి గుమస్తాలకి మాత్రం కుచేల సంతానంలా ఇస్తాడు ఆ దైవం - ఆకలితో అలమటించే పిల్లలు! సిల్కుబట్టలు లేకపోయినా చింకిపాతలకు కూడా కొరతబడిన ఇల్లాలు!! పాలడబ్బాకోసం పరితపిస్తూ కేర్ కేర్మని ఏడ్చే పశికందు!!!

ఒక్కొక్కప్పుడు సత్యమూర్తి తనభార్య కాపురానికి వచ్చిన కొత్తరోజులు, ముచ్చటగా గడిపిన ఆ మూడేళ్లు జ్ఞప్తికి తెచ్చుకొని 'అవి బ్రతికివున్న రోజులు; ఇవి చనిపోయినరోజులు-కాదు చావలేక బ్రతుకుతూన్నరోజులు' అని కుమిలిపోతాడు, అయినా తన బ్రతుకు ఎంతో ఖచ్చితంగా వున్నంతలోనే పొదుపుతో కుటుంబాన్ని పోషించుకువస్తున్నాడు. తన పిల్లలు 'గుమస్తా బిడ్డలు' అని స్పష్టంగా తెలిసేటట్లు బక్కచిక్కి రోగాలతో కన్పిస్తారు. ప్రతీ పురిటికీ తనభార్యని గవర్నమెంటు హాస్పత్రిలో జేర్పిస్తాడు సత్యమూర్తి బ్రతుకులో సుఖం, దుఃఖం, సరదా అనేవి పూర్తిగా అంతర్ధానమై ఒక నిర్జీవయంత్రంలా అయిపోయాడు.

ఒక్కొకప్పుడు సావిత్రినిచూచి మనస్సులోమథన పడ్తాడు సత్యమూర్తి. ఉనాడు తనూ -తన సావిత్రి- ఆరుగురు పిల్లలు, ఆనాటి సావిత్రికి-ఈనాటి సావిత్రికీ ఎంతో తేడా. పూర్వపు సావిత్రి ఎంతో నిండుగా పువ్వులు తొడిగిన తలలా కలకల్లాడుతూవుండేది. తనని పెళ్ళిచేసుకున్నాని ఈ పదేళ్ళల్లోనూ ఇల్లా మోడులా మారిపోయింది. సావిత్రి కాకుండా మరొకరయితే తను జీవితంలో ఈ సుఖానికి కూడా దూరమయ్యేవాడేమో! స్త్రీ అయిన తన భార్యకు కోరికలుండవా? తను ఆమెకు ఒక 'నగ' అయినా చేయించి ఒంటిని పెట్టలేదే? నల్గురిలోనూ కల్సి పేరంటానికి వెళ్ళేటప్పుడైనా కట్టుకోడానికి శుభ్రమైన చీర కొనలేదే! కానీ తన స్థితినిగుర్తించిన సావిత్రి ఎన్నడూ ఆ లోటును కన్పించకుండా

చేస్తోంది. తన భావాలకూ, చేతలకూ చేయూత నిస్తూ తనతోనే వంక పాడుతుంది తన అర్ధాంగి. విషాదగీతికలని వెగటు చెందదు; సంతోషతరంగాలని తేలిపడదు. ఈ మూలంగా చూస్తే తను సావిత్రి పట్ల ఋణశేషుడుగానే వున్నట్లు భావించి మనస్సులో బాధపడ్డాడు సత్యమూర్తి, పోనీ తనభార్యకీ బిడ్డలకీ లోటుచేసి తనేమన్నా వైభవాన్ని అనుభవిస్తున్నాడేమో అనుకొన్నా యెంత కప్పుకొన్నా బ్రతుకుల్లో చిరుగుల్లా తనచొక్కా నున్న చిరుగులు పైకి ఎగతన్నుతూనే ఉన్నాయ్. ఒక కోటు పైన వేసుకోవడం చేత ఆ చిరుగులు బయటకు కన్పించడం లేదు కాని...జీవితంలో చిరుగుల్నీ అతుగుల్నీ సులభంగా మనస్సులో భద్రపరుచుకొనివున్నట్లే చొక్కా చిరుగుల్ని కోటులోపల భద్రపరుస్తున్నాడు.

సత్యమూర్తికి ఇంట్లో ఎంత ఇబ్బందిగావున్నా పైకి నిండుకుండలా తనలాంటి గుమస్తాలతో కల్సిమెల్సి తిరుగుతున్నాడు. బయట వున్నంతసేపూ యింటిలో వ్యధల్నీ, బాధల్నీ, ఆకల్నీ, చిరునవ్వుతో కప్పిపుచ్చుకు తిరుగుతున్నాడు. నల్గురిలోనూ తన లోటును, దుర్బలత్వాన్నీ ప్రదర్శించుకోలేక, లోకం అవమానిస్తుందనీ, హీనంగా చూస్తారనీ, లేని సంతోషం ఎరువుతెచ్చుకొని ఆనందంగా వున్నట్లు నటిస్తున్నాడు సత్యమూర్తి.

* * *

సత్యమూర్తి ఉదయం పది గంటలకు ఆఫీసుకు వెళ్లడం, రాత్రి తొమ్మిది గంటల తరువాత ఇంటికి చేరుకోవడం...ఉదరపోషణ సంసారంకోసం ఉద్యోగం పేరుతో తననితాను విక్రయించుకొన్నది చాలక నాల్గు చోట్ల ట్యూషన్లుకూడా చెప్పుకొంటున్నాడు. అయినా తనకి డబ్బు చాలడంలేదు. ఈ మూడేళ్ళల్లోనూ తనకి ఇదివరకుండే అరడజనుమంది పిల్లలకి తోడుగా మరో యిద్దరు బయల్దేరారు.

సత్యమూర్తికి తెల్లవారిలేస్తే భయం, వీధులోకి వెళ్ళాలంటే కోపం—తెల్లవారితే యింట్లో భత్యాల కోసం అదటు—బయటకివెడితే ఊరినిండా అప్పులు—పిల్లలని చూస్తే కోపం—అతడు ఎంత కోపగించుకొంటూన్నా పిల్లలుమాత్రం తమకి కావల్సిన పుస్తకాల కోసం, పలకలకోసం, బట్టలకోసం, తమ కనీసపు అవసరాలైనా తీర్చేవరకూ తండ్రిని వేధిస్తూనే వుంటారు. రాగద్వేషాలతో వాళ్ళ అవసరాలు తండ్రిగా తను తీర్చకా తప్పడంలేదు సత్యమూర్తికి - సంసారంమీద ద్వేషం, అసహ్యం జడలా పెనవేసుకుపోతోంది అతని హృదయంలో - పశిపిల్లలు తనకాళ్ళకు చుట్టేసుకొని 'నాన్నగారూ! నాకు కీలుగుఱ్ఱం కొనిపెట్టరూ...కొనిపెట్టరూ?' అని అడిగినా; తలకి నూనెకూడా లేకుండా వుండే బిడ్డలూ; చిరుగుల బట్టలతో హైస్కూలుకు వెడుతూన్న ముగ్గురు పిల్లల్నీ చూచినప్పుడు సత్యమూర్తి మనస్సూ, మెదడూ, అగ్నిగుండంలా మండిపోతుంది. ప్రేమ, దుఃఖం, ద్వేషంకూడా కల్గుతాయ్.

తన శరీరాన్ని తానే చూచుకొంటాడు సత్యమూర్తి, వంటగదిలో నలుపెక్కిన ఎలక్ట్రిక్ వైర్సులాగ తన నరాలు బయటకు పొడుచుకువచ్చాయ్. చర్మం మాసిన కంబళిగుడ్డలా వ్రేలాడుతోంది. సంపాదనతో మొద్దుబారిన తన చేతులు పేలవంగా, సన్నగా, పల్చగా ఎండిపోయిన కాడల్లాగ వ్రేలాడుతున్నాయ్ - నెత్తురుముఖం చూడని గోళ్ళు ముడతలుపడ్డా వ్రేళ్ళల్లోకి చొచ్చుకుపోయాయ్. తనూ, తన భార్యాకూడా ఇంచుమించు టి-బి-తో కృశించిన రోగుల్లా అయిపోయారు.

ఆ దంపతు లిద్దరూ సంసార భారంతో, వివరింపరాని విచారంతో, అంతుపట్టని నిరాశతో, కన్న సంతతిని ఎల్లా అభివృద్ధికి తేవాలా? అన్న బెంగతో, జీవితంలో సౌఖ్యమనేదానికి తిలోదకాలిచ్చి, తీరికచిక్కినప్పుడల్లా మస్తిష్కంతో కుస్తీ పడ్తూంటారు. ఇదే సావిత్రీ సత్యమూర్తుల సంసారం.

* * *

'సావిత్రీ! మన అబ్బాయి యస్సెల్సీ ప్యాసయ్యాడు. మన కష్టం ఫలించింది.' అన్నాడు పేపరు చూచిన సత్యమూర్తి.

'ఇంక మనకేబాధాలేదు. అబ్బాయి చేతికి అందొచ్చాడు' నవ్వుతూ అంది సావిత్రి.

'మన చంటిబాబుకూడా పెద్దవాడంత అయ్యేవరకూ మనకీ రాగద్వేషాలు తప్పవు సావిత్రీ!' అంటూ ఆమె చంకలోవున్న కొడుకుని ముద్దుపెట్టుకోబోయాడు సత్యమూర్తి. ఆ దంపతులిద్దరూ ఒకేసారి చెక్కిళ్ళమీద ముద్రలు వెయ్యబోతోంటే ముఖం వెనక్కి త్రిప్పేశాడు ఆ కొంటె పిల్లవాడు.

సంతృప్తితో సంతోషపూరిత వదనంతో 'సావిత్రీ! శరీరంలో సత్తువ వున్నప్పుడు మనం ఎంత శ్రమపడినా ఇంక భవిష్యత్తులో మనల్ని పోషించడానికి కొడుకులు ఎదుగుతున్నారు - నిన్ను సుఖపెట్టడానికి కోడళ్ళు వస్తారు-' అన్నాడు సత్యమూర్తి.

ఆశతో భావిని ఊహించుకొని తమ బిడ్డలు గొప్ప 'మేధావులు' అవుతున్నారని వారిద్దరి కళ్లూ కాంతితో మిలమిలా మెరిసిపోయాయ్.

(6వ పేజీ తరువాయి)

పక్షిలా అందంగా ఊహించు,' అనుకొన్న గెనా అత్తయ్య ఆనందంగా, 'పునరుజ్జీవనం', ఆ మాట తాను పెద్దగా అన్నదా, లేక మరే కారణంవల్లనో ఆమె ప్రక్కనే కూర్చొన్న యువకుడు చెయిపట్టి లాగుతూ నువ్వు ముసలిదానివి. అలసిపోయి ఉంటావు. కూర్చో, అన్నాడు,

గెనా అత్తయ్య యువకుడి టోపీమీద హాస్యంగా నొక్కుతూ, 'మీ నానమ్మ ముసిల్ది; నేను కాదు' అన్నది.

అంతా ఒక్కసారిగా నవ్వారు. కుర్రవాడు టోపీ పైకి లాక్కున్నాడు. కాని గేనా అత్తయ్య తలఊపింది

'ముసలిదాన్నంటావా. ఇంకా నాకు పదిహేడేళ్లే నని నీకు తెలియదూ?'

చివరి మాటలు అనుకోకుండానే అనేసింది. తర్వాత గుర్తించింది తన తప్పును. బస్సులోనివాళ్ళంతా మళ్ళీ ఒక్కసారిగా నవ్వారు.

తన మాటల్లో అంతగా నవ్వాల్సిందేమున్నది? ఇప్పుడు తాను యిందాక అన్నమాటలు చాలా బాగున్నాయనిపించింది. నిజానికామె జీవించింది అంత కాలమే. తానేకాదు, ఇతరులసంగతి కూడా అంతే. గెనా అత్తయ్య దుగాణదారు భార్యవైపు చురచురా చూచింది. ఆమె వట్టి అల్పురాలనిపించింది. గెనా మళ్ళీ గట్టిగా యిలా అన్నది.

'ఎందుకలా నవ్వుతున్నారు? నేనన్న మాటల్లో సత్యం లేదా?'

'ఎందుకు లేదూ? అనుకొంటే తప్పేమున్నది?' అన్నాడు ఒక యువకుడు. మరింత గట్టిగా నవ్వారంతా. లోపల యేమి జరుగుతున్నదోనని డ్రైవర్ కుతూహలంగా రెండుమూడుసార్లు లోపలికి చూచాడు, గెనా అత్తయ్య తన జీవితం యిటీవలనే, ప్రజల ప్రభుత్వం లోకి వచ్చిన తర్వాతనే ప్రారంభమయిందని చెప్పాలనుకొన్నది. అప్పుడే ఆమె కొడుకు పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడయ్యాడు. ఆ రోజు మొదలుకొనే, తన పేరు పెట్టబడిన తన మనుమరాలు కాళ్ళకు చెప్పులైనా లేకుండా పొలాల్లో రాత్రింబగళ్ళు పనిచేయనవసరం ఉండదని ఆమె గుర్తించింది. ఆ విషయమే వాళ్లందరికీ చెప్పాలనుకొన్నది. అప్పుడు వాళ్ల యిష్టం వచ్చినట్లు నవ్వుకోనీ, కాని తన వయస్సునుగురించి ఆమె అన్న మాట యెంత అసందర్భంగా ఉన్నదంటే, అక్కడ ఉన్న యువతులు పొట్ట చెక్కలయ్యేటట్టు ఒకటే నవ్వటం నవ్వసాగారు. గెనా అత్తయ్య ముఖం దేవురించింది. ముసలివాళ్ళు యేవో గుసగుసలాడుకొంటున్నట్లనుపించింది. వాళ్ళ చూపులు బాకుల్లాగ ఆమెలోకి దూసుకుపోతున్నట్లనుపించింది. దుకాణదారు భార్య గెనా ఆమె యింట్లో పనిమనిషిగా ఉంటున్న రోజులలో చూచినట్లు వికటంగా చూడసాగింది. ఆమె కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఏడ్పువచ్చినంతపనయింది. ఎందుకు వీళ్ళిట్లా నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తున్నారు? తనలాగే వాళ్ళూ బాధలు పడలేదూ? ఆకలికి అలమటించి పోలేదూ? ఈ రోజు వాళ్లపిల్లలు యెంత ఆనందంగా జీవిస్తున్నారు? ఈ కాలపు పిల్లలు యిలా నవ్వినా అర్థం ఉన్నది. కాని ముసలివాళ్లు కూడా నవ్వుతున్నారంటే...

దుకాణదారు భార్యవైపు తిరిగి గెనా యిలా అన్నది 'ఏయ్, డోనా, యెందుకలా నవ్వుతావు? నే నన్నది నిజమేకాదా? నీ దగ్గర పనిమనిషిగా ఉంటున్నప్పుడు గడిపిన జీవితం ఒక జీవితమేనా? మీరు అన్నాలుతినే దాకా పడిఉంటే మిగిలినవన్నీ నా ముఖాన కొట్టే వారు గుర్తులేదూ? మీ కుక్క బ్రతుక్కంటే నా బ్రతుకు హీనంగా ఉండేదన్న విషయం మరిచిపోయావా?

దుకాణాదారు భార్యకు ముఖంమీద కొట్టినట్లనిపించింది. 'చాల్లే, మాట్లాడావు, ఊరుకో', అన్నది.

ఆ మాటలు వినేటప్పటికి గెనాకు అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది.

'ఒకనాటి చలికాలంలో'. నేను మీ గొడ్లశాలలోకి గడ్డి తీసుకుపోతూండగా ఆ గడ్డి గాలికి యెగిరిపోయి నప్పటి విషయం గుర్తులేదూ? మీనాయన కట్టెతో నన్నెట్లా బాదాడు!'

ఆమె మళ్లీ ప్రారంభించింది. 'ఈ విషయాలు అందరికీ తెలియాలి. ఆ బ్రతుకు ఒక బ్రతుకేనా?'

దుకాణదారు భార్య ముఖం తిప్పుకొని కిటికీలోంచి బయటికి చూడ సాగింది. కోపంతో అన్నది, 'అన్నీ అబద్ధాలు.'

అబద్ధాలు చెబుతున్నానా? ఒకనాడు మీ బాబాయి నన్ను మీ గొడ్లశాలలో యెలా పట్టుకొన్నాడో నేనీ జన్మలో మరవగలనా? అదృష్టవశాత్తు మీ తాతయ్య నా ఆలుపులు విని పరుగెత్తుకొచ్చాడు.

'అన్నీ అబద్ధాలే,' అన్నది డోనా కోపంతో ఉడికిపోతూ,

బస్సు ఇంతలో ఆగింది. 'ఎవరైనా దిగుతున్నారా?' అని కండక్టర్ అడిగాడు.

'నేను దిగుతాను', అంటూ దుకాణదారు భార్యలేచి చరచరా వెళ్లిపోయింగి.

ఆమె దిగగానే కండక్టర్ చప్పున తలుపువేసి ముఖం చిట్లించాడు. బస్సులోనివాళ్లంతా గొల్లున నవ్వారు.

గెనా అత్తయ్య ముందుకు అడుగువేసింది. స్త్రీలు ప్రక్కకు సర్దుకొని ఆమెకు స్థానం యిచ్చారు. సగర్వంగా ఆమె అక్కడ కూర్చున్నది.